సాక్షి నల్లగొండ

శనివారం : 27 : సెప్టెంబర్ : 2025



మధురం.. సీతాఫలం

సీతాఫలాలు ఎంతో ఆరోగ్యకరం. చిన్నా, పెద్దా తేడాలేకుండా ఎంతో ఇష్టంగా తింటుంటారు. - IIలో



యువత చేతుల్లోనే..

దేశ భవిష్యత్‌ను మార్చే శక్తి యువతకే ఉందని విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. - IIలో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	587.40 అడుగులు
ఇన్‌ఫ్లో	:	2,77,119 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	2,73,641 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,130 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	8,529 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్



బతుకమ్మ సంబరం

బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మెప్మా ఉద్యోగులు

నల్లగొండ ఎస్పీగా పనిచేసిన శివధర్‌రెడ్డి

- భువనగిరి జిల్లా వర్కట్‌పల్లి అల్లుడు
- డీజీపీగా నియామకంపై హర్షం



నల్లగొండ: రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన శివధర్‌రెడ్డి గతంలో పూర్వ నల్లగొండ జిల్లా ఎస్పీగా పనిచేశారు. 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శివధర్‌రెడ్డి నల్లగొండ ఎస్పీగా 2000 ఏప్రిల్ 1 నుంచి 2002 ఏప్రిల్ 15 వరకు పనిచేశారు. నక్సల్స్ కార్యకలాపాలను అరికట్టడంలో, గ్యాంగ్‌స్టర్‌లను అణచివేయడంలో ఆయనకు మంచి పేరుంది. శివధర్‌రెడ్డి స్వస్థలం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కాగా.. భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్‌పల్లి ఆయన అత్తగారి ఊరు. శివధర్‌రెడ్డి.. టీఆర్‌ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, సీనియర్ నాయకుడు దివంగత క్లెం యాదగిరిరెడ్డి అల్లుడు.

తెలంగాణ వీరవనిత.. చాకలి ఐలమ్మ



ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, నాయకులు

నల్లగొండ : తెలంగాణలో తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండలోని సాగర్ రోడ్డులో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఐలమ్మ జయంతి ఉత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఐలమ్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, చొల్లేటి ప్రభాకర్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ వై.అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ పీడీ, బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి రాజ్‌కుమార్, బీసీ సంఘాల నాయకులు కొండూరు సత్యనారాయణ, రామరాజు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

తొలిరోజు ఒక్క టెండర్

నల్లగొండ : మద్యం దుకాణాలకు టెండర్ దాఖలు ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజు శుక్రవారం ఒక టెండర్ దాఖలయ్యింది. మిర్యాలగూడ పట్టణ పరిధిలోని 45వ షాపునకు ఒక టెండర్ వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ తెలిపారు. జిల్లాలో మొత్తం 154 మద్యం దుకాణాలు ఉండగా ఎస్సీలకు 14, ఎస్టీలకు 4, గౌడ సామాజిక వర్గానికి 34 షాపులను కేటాయించారని.. వాటికి ఆయా కులస్తులు కుల ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

నల్లగొండకు నేడు మంత్రి కోమటిరెడ్డి రాక



కనగల్ : తేలకంటిగూడెంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం నల్లగొండకు రానున్నారు. ఉదయం 9గంటలకు మంత్రి క్యాంపు కార్యాలయం(ఇందిరా భవన్)లో ప్రజలకు అందుబాటులో ఉంటారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. 11గంటలకు ఏటీసీ సెంటర్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నారెడ్డిగూడెం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు నల్లగొండలోని అశోక గార్డెన్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాలను అందిస్తారు. 1.30 గంటలకు కనగల్ మండలం తేలకంటిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు.

అవార్డు అభినందనీయం

నల్లగొండ : జల సంచయ్ జల్ బాగిదారి (జేఎస్‌జేబీ) జాతీయ అవార్డుల్లో దక్షిణ భారత జోన్‌లో టాప్ 3 స్థానాలు తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకోవడం, నల్లగొండ జిల్లాకు అవార్డు రావడం అభినందనీయమని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాకు విజయం అందించిన అధికారులు, ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

ఏఎమ్మార్పీ డీఈగా మహేష్‌కుమార్

నల్లగొండ : ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) డివిజన్-6 డివిజనల్ ఇంజనీర్‌గా మహేష్‌కుమార్ శుక్రవారం నల్లగొండలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు.

సన్న బియ్యానికి సంచులు

అక్టోబర్ నుంచి బియ్యంతోపాటు చేతిసంచి

- అందరికీ సన్నబియ్యం.. ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం.. అని వాటిపై ముద్రణ
- ఉమ్మడి జిల్లాలో 10 లక్షలకు పైగా రేషన్‌కార్డులు
- ప్రతి కార్డుదారుడికి చేతి సంచి అందించేందుకు ప్రణాళిక



రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయనున్న చేతి సంచుల నమూనా.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం చేతి సంచులను అందించనుంది. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందజేస్తున్న సన్న బియ్యం ఒక్క యూనిట్‌కు ఇచ్చే ఆరు కిలోల బియ్యం పట్టేలా ప్రత్యేక సంచిని రూపొందించింది. ఇప్పటికే రాష్ట్రస్థాయి నుంచి జిల్లాకు చేరిన సంచులను జిల్లా పౌరసరఫరాల శాఖ రేషన్ షాపులకు పంపింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10లక్షలకు పైగా ఉన్న రేషన్ కార్డుదారులు ఉన్నాయి. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఇచ్చే సన్న బియ్యంతోపాటు ప్రతి కార్డుదారుడికి ఒక్కో సంచిని రేషన్ డీలర్లు పంపిణీ చేయనున్నారు.

నల్లగొండలోనే అత్యధిక కార్డుదారులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే నల్లగొండ జిల్లాలోనే అత్యధికంగా రేషన్ కార్డులు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో గతంలో 4,65,998 రేషన్ కార్డులు ఉండగా, ఇటీవల ప్రభుత్వం కొత్తగా మరో 50,102 కొత్త రేషన్ కార్డులను జారీ చేసింది. దీంతో జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య 5,16,100కు చేరుకుంది. ఆయా కార్డుల కింద జిల్లాలో మొత్తంగా16,80,916 మందికి సన్న బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. సూర్యాపేట జిల్లాలో పాతవి 3,26,057 రేషన్ కార్డులు ఉండగా, ఇటీవల కొత్తగా 23,870 కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో మొత్తం 3,49,927 కార్డుల ద్వారా 10,57,863 మందికి లబ్ధి చేకూరుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో పాత రేషన్ కార్డులు 2,16,831 ఉండగా, కొత్తగా 15,077 కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరయ్యాయి. ఇక్కడ మొత్తం 2,31,908 రేషన్ కార్డుల ద్వారా 7,29,746 మందికి సన్న బియ్యం ఇస్తోంది.

రేషన్‌కార్డుల వివరాలు

జిల్లా	కార్డులు	లబ్ధిదారులు
నల్లగొండ	5,16,100	16,80,916
సూర్యాపేట	3,49,927	10,57,863
యాదాద్రి	2,31,908	7,29,746

ఇంట్లో అవసరాలకు కూడా ఉపయోగపడేలా..

ప్రభుత్వం అందజేయనున్న చేతి సంచి ప్రజలకు ఇంట్లో ఇతర అవసరాలకు ఉపయోగపడేలా రూపొందించింది. మార్కెట్‌కు వెళితే కూరగాయలు తెచ్చుకునేందుకు కూడా దీనిని వినియోగించుకునే వీలుంటుంది. రేషన్ కార్డుదారుడు ఒక్కరి (6 కేజీలు) బియ్యం పట్టేలా ఈ సంచి సిద్ధం చేశారు. ఆ సంచిపై ఆరు గ్యారెంటీలకు సంబంధించిన పథకాల పేర్లు, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలను ముద్రించారు. అలాగే ఆ సంచులపై అందరికీ సన్నబియ్యం.. ప్రజాప్రభుత్వంతోనే సాధ్యం.. తెలంగాణ పౌరసరఫరాల శాఖ, ప్రగతి పథం.. సకల జన హితం.. మన ప్రజా ప్రభుత్వం అంటూ ముద్రించారు.

కాంగ్రెస్‌లో మదర్ డెయిరీ మంటలు!

మూడు డైరెక్టర్ల స్థానాలకు నేడు ఎన్నికలు

- స్నేహపూర్వక పొత్తు కుదుర్చుకున్న అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్షం
- కాంగ్రెస్‌కు రెండు, బీఆర్‌ఎస్‌కు ఒకటి
- పొత్తుపై తుంగతుర్తి ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి

సాక్షి, యాదాద్రి: నల్లగొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమాఖ్య లిమిటెడ్ (నార్ముల్ మదర్ డెయిరీ) పాలకవర్గ ఎన్నికలు కాంగ్రెస్‌లో చిచ్చు రగిల్చాయి. మూడు డైరెక్టర్ల స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు స్నేహపూర్వక పొత్తు కుదుర్చుకోవడంతో అధికార పార్టీలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మూడు చోట్ల గెలిచే అవకాశం ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్‌తో పొత్తు ఎందుకని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డిపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ విరుచుకుపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా పనిచేసిన బీఆర్‌ఎస్ నాయకున్ని మీరు ఏ విధంగా గెలిపిస్తారని మండిపడుతున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిస్తే బీర్ల అయిలయ్య రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఎమ్మెల్యే సామేల్‌కు ఫోన్ చేసి విషయంపై వాకబు చేశారు. అయితే పోటీలో ఉన్న మోతె పూలమ్మ, పిచ్చిరెడ్డికి ఇచ్చిన షోకాజ్ నోటీస్ చర్చనీయాంశంగా మారింది. పిచ్చిరెడ్డి సైతం బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకోవడాన్ని తప్పుపట్టారు.

308 మంది పాల సంఘాల చైర్మన్లు

మూడు డైరెక్టర్ స్థానాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో 308 మంది పాలసొసైటీ చైర్మన్లు ఓటింగ్‌లో పాల్గొంటారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు తమ చైర్మన్లను శుక్రవారం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ సమీపంలోకి క్యాంపులకు తరలించారు. శనివారం ఉదయం క్యాంప్‌ల నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుంటారు. పోలింగ్ అనంతరం మధ్యాహ్నం ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటిస్తారు. ఒక మహిళ, రెండు జనరల్ స్థానాలకు ఐదుగురు పోటీ పడుతున్నారు. వీరిలో మహిళ, ఒక జనరల్ డైరెక్టర్ స్థానాలకు కాంగ్రెస్, ఒక డైరెక్టర్ స్థానానికి బీఆర్‌ఎస్ పార్టీ గెలిచేలా ఇరు పార్టీల నాయకులు ఒప్పందం చేసుకున్నారు.

పోటీలో ఉన్నదీ వీరే..

కర్నాటి జయశ్రీ, గంట్ల రాధిక, మోతె పూలమ్మ, సూధగాని విజయ, కుంచాల ప్రవీణ్‌రెడ్డి, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, శీలం వెంకటనర్సింహారెడ్డి, సందిల భాస్కర్ గౌడ్.

పాడి భవిష్యత్ కోసమే..

పాడి రైతుల భవిష్యత్ కోసమే బీఆర్‌ఎస్‌తో పొత్తుకు దిగినట్లు చైర్మన్ గుడిపాటి చెబుతున్నారు. నార్మాక్స్‌ను ఎన్‌డీడీబీకి అప్పగించేందుకు బీఆర్‌ఎస్ సహకరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈనెల జరిగే జనరల్ బాడీ సమావేశంలో ఎన్‌డీడీబీకి అప్పగిస్తూ పాలక వర్గం తీర్మానం చేసి ఇవ్వాల్సి ఉంది. పాలకవర్గంలో బీఆర్‌ఎస్ డైరక్టర్లు ఉన్నారు. అయితే తమకు ఒక స్థానం ఇస్తే తీర్మానంలో సహకరిస్తామని ఇచ్చిన హామీ మేరకు బీఆర్‌ఎస్‌కు ఒక స్థానం కేటాయించినట్లు చైర్మన్ సాక్షితో చెప్పారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం

- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ

నల్లగొండ: స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ శుక్రవారం జీఓ జారీ చేసింది. ఇప్పటికే జిల్లాలో రిజర్వేషన్లు ఖరారు చేసిన అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. శుక్రవారం జిల్లాలో ఎన్నికల అధికారులకు శిక్షణ శిక్షణ కూడా ఇచ్చారు. శనివారం సాయంత్రానికి స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

ఖరారైన రిజర్వేషన్లు..?

రెండు రోజుల క్రితం జెడ్పీటీసీ, ఎంపీపీలు, ఎంపీటీసీల రిజర్వేషన్ల ప్రక్రియను జిల్లా అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో 33 చొప్పున ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలుండగా అందులో ఎస్సీ, ఎస్టీలకు పాత పద్ధతిలోనే (ఎస్సీలకు 6, ఎస్టీలకు 5) రిజర్వేషన్ చేశారు. బీసీలకు మాత్రం గతంలో 4 స్థానాలు ఉండగా.. ఈసారి 42 శాతం రిజర్వేషన్ ప్రకారం అవి 14 స్థానాలకు పెరగనున్నాయి. మిగిలిన సీట్లు అన్ రిజర్వుడు కేటగిరిగా పరిగణిస్తారు. ఇక, 2019 ఎన్నికల్లో 349 ఎంపీటీసీ స్థానాలు ఉండగా అందులో ఎస్టీలకు 52, ఎస్సీలకు 61, బీసీలకు 50 సీట్లు కేటాయించి 186 సీట్లు అన్ రిజర్వుడుగా ప్రకటించారు. ఇప్పుడు 4 ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. దాంతో ఎంపీటీసీల సంఖ్య 353కు చేరింది. ఈసారి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు యథావిధిగానే ఉంటాయి. బీసీలకు మాత్రం 148 స్థానాలు దక్కనున్నాయి. అంటే గతంలో కంటే 98 సీట్లు బీసీలకు అధికంగా రిజర్వ్ కానున్నాయి. అన్ని కేటగిరీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తారు. అయితే ఈ రిజర్వేషన్ల ప్రక్రియ అంతా జిల్లా స్థాయిలో ఖరారు చేసి.. కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. వీటిని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

ప్రభుత్వానికి ధన్యవాదాలు



బీసీలు రిజర్వేషన్ల కోసం ఏళ్ల తరబడి పోరాటం చేస్తూనే ఉన్నాం. ప్రభుత్వం కామారెడ్డి ప్రకటనకు కట్టుబడి 42 శాతం రిజర్వేషన్ల అమలుకు జీఓ తేవడం హర్షించదగ్గ విషయం. ఆ జీఓ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలి. ఎవరూ కోర్టుకు వెళ్లకముందే షెడ్యూల్ విడుదల చేసి ఎన్నికలు నిర్వహించాలి. విద్యా, ఉద్యోగుల్లో కూడా 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి.

– చక్రహరి రామరాజు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు

నోడల్ అధికారులతో సమావేశం

నల్లగొండ : గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులతో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమావేశమయ్యారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎక్కడా అపోహలకు తావివ్వ వద్దని సూచించారు.

పంచాయతీ ఎన్నికల నోడల్ అధికారుల వీరే..

- మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్.. డీఈఓ భిక్షపతి
- బ్యాలెట్ బాక్స్‌ల నిర్వహణ.. సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ సుజాత
- ట్రాన్స్‌పోర్ట్ మేనేజిమెంట్.. జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి లావణ్య
- ట్రైనింగ్ మేనేజ్మెంట్.. గృహ నిర్మాణ పీడీ రాజ్ కుమార్
- మెటీరియల్ మేనేజ్మెంట్.. డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి
- ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల నిర్వహణ.. నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి
- వ్యయ నిర్వహణ.. డీసీఓ పత్యానాయక్
- ఎన్నికల పరిశీలన.. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జీవీ.రమేష్
- బ్యాలెట్ పత్రాలు.. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్
- మీడియా కమ్యూనికేషన్.. డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు
- హెల్ప్ లైన్ ఫిర్యాదులు.. జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు
- నివేదికలు.. డీపీఓ కార్యాలయ ఏఓ ఎస్.కృష్ణ

ఎన్నికలను సవ్యంగా నిర్వహించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను సవ్యంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలపై శుక్రవారం ఉదయాదిత్య భవన్‌లో స్టేజ్ 1, స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో సొంత నిర్ణయాలను తీసుకోవద్దని, తప్పులు జరిగితే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. ప్రతి ఉద్యోగి ఎన్నికల సంఘం జారీచేసిన హ్యాండ్‌బుక్‌ను, నియమ, నిబంధనలను పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్యను ఆదేశించారు. ఎన్నికల విధులకు నియమించే ఉద్యోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, టీఏ, డీఏ చెల్లిస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్, డాక్టర్ రమేష్, మాస్టర్ ట్రైనర్ బాలు పాల్గొన్నారు.

జోరు వాన.. పారిన వరద

- పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు
- తిరుమలగిరిలో అత్యధికంగా 12.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు



పెద్దవూర : అలుగు పోస్తున్న పెద్దవూర చెరువు



తిరుమలగిరి సాగర్ : వరి చేల మీదుగా ప్రవహిస్తున్న వరద



అలుగు పోస్తున్న డిండి ప్రాజెక్టు

నల్లగొండ అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లా అంతటా భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు, పొంగిపొర్లడంతో పాటు పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరి, పత్తి చేలల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. మరో రెండు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో పంట పొలాలకు, పత్తి చేలకు నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 52.3 మిల్లీమీటర్ల సగటు వర్షం కురిసింది. అత్యధికంగా తిరుమలగిరిసాగర్‌లో 12.5 సెంటీ మీటర్ల వర్షం కురిసింది.

వర్షపాతం ఇలా..

త్రిపురారం మండలంలో 97.1మిల్లీమీటర్లు, పెద్దవూర 86.4, అడవిదేవులపల్లి 83.2, మిర్యాలగూడ 79.9, అనుముల హాలియా 79.8, చిట్యాల 26.8, నార్కట్‌పల్లి 27.3, కట్టంగూర్ 34.7, శాలిగౌరారం 20.2, నకిరేకల్ 35.1, కేతేపల్లి 23.4, తిప్పర్తి 53.3, నల్లగొండ 45.3, కనగల్ 58.0, మునుగోడు 43.7, చండూరు 53.0, మర్రిగూడ 38.3, చింతపల్లి 24.0, నాంపల్లి 36.4, గుర్రంపోడు 59.2, నిడమనూరు 55.4, మాడ్గులపల్లి 61.5, వేములపల్లి 74.5, దామరచర్ల 52.1, పీఏపల్లి 57.3, నేరడుగొమ్ము 39.3, కొండమల్లేపల్లి 59.9, దేవరకొండ, 30.6, గుండ్లపల్లి 34.6, చందంపేట 39.5, గట్టుప్పల్ 26.5, గుడిపల్లి 63.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

పొంగిన వాగులు

పెద్దవూర: మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయి. మండలం నుంచి ప్రవహించే పెద్దవాగు పొంగి పొర్లింది. పెద్దవూర, పోతునూరు, సంగారం, నాయినివానికుంట, చింతపల్లి, శిర్సనగండ్ల, వెల్మగూడెం తదితర గ్రామాలలోని చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. పలు కల్వర్టు పైనుంచి వరద పొంగిపొర్లడంతో వాహనదారులకు ఇబ్బంది పడ్డారు.



తిరుమలగిరి సాగర్ : లక్ష్మీపురం వద్ద నీట మునిగిన పత్తిపంట

మూసీ తొమ్మిది గేట్లు ఎత్తివేత

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు హైదరాబాద్ నుంచి భారీగా వరద వచ్చే అవకాశాలు ఉండటంతో శుక్రవారం రాత్రి అధికారులు ప్రాజెక్టు 9 గేట్లు ఎత్తారు. హైదరాబాద్‌లోని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలు పూర్తిస్థాయిలో నిండటంతో అక్కడి అధికారులు ఆయా ప్రాజెక్టుల గేట్లు ఎత్తి వరద నీటిని మూసీ నదిలోకి వదిలారు. వరద ఉధృతి భారీగా పెరిగే అవకాశం ఉండడంతో అప్రమత్తమైన మూసీ అధికారులు ఏడు క్రస్ట్‌గేట్లను 2 అడుగులు, 2 క్రస్టు గేట్లను 3 అడుగులు(మొత్తం 9గేట్లు) పైకెత్తి 13వేల క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి వదులుతున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 313 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా 644 మేర అడుగుల మేర నీరు ఉందని అధికారులు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి: మూసీ గేట్లు ఎత్తి భారీగా వరద నీటిని వదులుతున్న నేపథ్యంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని మూసీ తీర ప్రాంతం వెంట ఉన్న 41 గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల శాఖ సూర్యాపేట డివిజన్-1 ఈఈ వెంకటరమణ సూచించారు. మూసీ వాగు వెంట మోటార్లు అమర్చుకుని వ్యవసాయం చేసుకునే వారు వాటిని తొలగించి ఎగువ ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. గొర్రెల, పశువుల కాపర్లు, రైతులు, జాలర్లు మూసీ వాగులోకి వెళ్లవద్దని సూచించారు.

డిండికి పెరిగిన వరద

డిండి : ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి కొనసాగుతున్న దుందుభి వాగుకు వరద ప్రవాహం పెరిగింది. దీంతో శుక్రవారం డిండి రిజర్వాయర్‌లోకి 4,700 ఇన్‌ఫ్లో వస్తోందని ఇరిగేషన్ శాఖా ఏఈ పరమేష్ తెలిపారు. విద్యా సంస్థలకు సెలువులు ఉండటంతో డిండి ప్రాజెకు అందాలను చూసేందుకు పర్యాటకుల భారీగా తరలివస్తున్నారు.

క్లుప్తంగా

ఉత్తమ పర్యాటక క్షేత్రంగా యాదగిరిగుట్ట



యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం టూరిజం ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైనట్లు ఆలయ అధికారులు శుక్రవారం రాత్రి వెల్లడించారు. అవార్డును శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అందజేయనున్నారు. యాదగిరి క్షేత్రానికి అవార్డు రావడం ఆనందంగా ఉందని ఇన్‌చార్జి ఈవో గగులోతు రవినాయక్ పేర్కొన్నారు.

ఊంజల్ సేవోత్సవం



హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. సాయంత్రం సమయంలో అమ్మవారిని బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అమ్మవారిని మండపంలో అధిష్ఠించి ఊంజల్ సేవోత్సవం జరిపించారు. ఇక ఆలయంలో నిత్య పూజలు యథావిధిగా కొనసాగాయి.

యాదాద్రీశుడి సన్నిధిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

• బంగారు కనకదుర్గమ్మ

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం మహాలక్ష్మీదేవిగా అలకరించారు. సుమారు అర కేజీకి పైగా బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలకరించారు.



• రూ.18,50,116 కరెన్సీతో అలంకరణ

మఠంపల్లి: మండలంలోని హనుమంతులగూడెంలో కనకదుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మిదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని రూ.18,50,116ల కరెన్సీ నోట్లతో అలంకరించారు.



రేషన్ బియ్యం పట్టివేత

డిండి: అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ సిబ్బంది, పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండలం ఎర్రారం గ్రామ సమీపంలోని రైస్ మిల్లులో ఎలాంటి అనుమతులు లేకుండా 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బాలకృష్ణ, ఆర్ఐ నర్సింహ అక్కడకు చేరుకుని బియ్యాన్ని సీజ్ చేసి దేవరకొండ డీటీసీఎస్ గోదాంకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మధురం.. సీతాఫలం

- రుచితోపాటు ఆరోగ్యానికి మేలు
- ప్రారంభమైన పండ్ల విక్రయాలు



రాజాపేట : సీతాఫలాలంటే ఇష్టపడని వారుండరు. సెప్టెంబర్ చివరివారం నుంచి మొదలుకుని నవంబర్ వరకూ ఈ ఫలాలు విరివిగా లభిస్తాయి. కురిసిన వర్షాలను బట్టి సీతాఫలాలు లభిస్తుంటాయి. సీతాఫలాలు ఎంతో ఆరోగ్యకరం . చిన్నా, పెద్దా తేడాలేకుండా ఎంతో ఇష్టంగా తింటుంటారు. వీటిలో గ్లూకోజ్, మిటవిన్ సీ, ఏ, బీ6, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్, యాంటిఆక్సిడెంట్లు, పిండిపదార్థాలు మెండుగా ఉంటాయి. పోషక విలువలతో కూడిన సీతాఫలాలు తీసుకుంటే శరీరం ఎంతో ఆరోగ్యకరంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇవి తేలికగా జీర్ణం కావడంతోపాటు పోషక పదార్థాలు సమృద్ధిగా అందుతాయని పేర్కొంటున్నారు.

రైతు కూలీలకు జీవనోపాధి

సీతాఫలాలు అక్టోబర్, నవంబర్ మాసాల్లో ఎక్కువగా లభిస్తుంటాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే విరివిగా వచ్చేసాయి. ఈ సీతాఫలాలతో కొందరు రైతుకూలీలు జీవనోపాధి పొందుతారు. రాజాపేట మండలంలోని సింగారం, పుట్టగూడెం, కొండేటిచెర్వు, మల్లగూడెం, చల్లూరు, నర్సాపురం, బొందుగుల తదితర గ్రామాల్లో ఎక్కువగా సీతాఫలాలు లభిస్తుంటాయి. కూలీలు తమ వ్యవసాయ పొలాల వద్ద ఫలాలను సేకరించే పనిలో ఉంటారు. ఒక్క బాక్స్‌ను రూ.300 వరకు విక్రయిస్తున్నారు. ఇలా సేకరించిన సీతాఫలాలు హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్, సిద్దిపేట వంటి ప్రదేశాలకు ఎగుమతి చేస్తారు. వ్యాపారులు మాత్రం పట్టణాల్లో రూ.700 నుంచి రూ. 1000 వరకు విక్రయిస్తుంటారు.



విక్రయానికి సిద్ధంగా ఉంచిన సీతాఫలాలు



సీతాఫలాలను వాహనంలో తరలిస్తున్న రైతులు

చెట్టుచెట్టుకు తిరిగి సేకరిస్తాం



సీతాఫలాలు రెండు నెలలపాటు లభిస్తాయి. చెట్టుచెట్టుకు తిరిగి పండ్లు సేకరిస్తాం. వీటిని రోజుకు రూ. 200 నుంచి రూ. 300 వరకు వస్తాయి. వ్యాపారులు మా దగ్గర సీతాఫలాలను తక్కువ ధరకు హైదరాబాద్, సికింద్రాబాద్‌కు తీసుకెళ్లి అధిక ధరలకు విక్రయించి సొమ్ముచేసుకుంటారు.

– కర్రె లక్ష్మి, రాజాపేట మహిళా కూలీ

మహిళల ఆరోగ్య శ్రేయస్సుకు ప్రధాని మోదీ కృషి

- ఎంపీ డీకే అరుణ

బీబీనగర్: మహిళల ఆరోగ్య శ్రేయస్సుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్‌ను ప్రవేశపెట్టారని ఎంపీ, ఎయిమ్స్ బోర్డు మెంబర్ డీకే అరుణ అన్నారు. స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్‌లో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. ఎయిమ్స్‌లో అందుతున్న వైద్య సేవలు, వసతుల పట్ల రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంత శాంతసింగ్, డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్‌తో సమావేశమై స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్‌లో భాగంగా కొనసాగుతున్న క్యాంప్‌లు, కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు, ఆమె మాట్లాడుతూ.. స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్‌లో భాగంగా మహిళలకు మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు, ఉచితంగా అనేక రకాల టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. ఎయిమ్స్‌లో సెప్టెంబర్ 17వ తేదీ నుంచి 9,400మంది మహిళలు టెస్టులు చేయించుకున్నారని పేర్కొన్నారు. నిరుపేదలందరికీ మెరుగైన వైద్యం అందించడమే ఎయిమ్స్ లక్ష్యమని, ఆదిశగా ఎయిమ్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట బీజేపీ నాయకులు వెముల అశోక్, జగన్మోహన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, నరోత్తమరెడ్డి, గోపాల్‌రెడ్డి, రవీందర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

పరిమితికి మించి ఆటోలో ప్రయాణం

- ఆటోడ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వస్తున్న ఆటోను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆపి డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌటుప్పల్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గాను శుక్రవారం మునుగోడు క్యాంప్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే తన కాన్వాయ్‌తో వస్తున్నారు. అదే సమయంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామ శివారులో నారాయణపురం నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటోను చూసి తన కాన్వాయ్‌ను ఆపి ఆటో వద్దకు చేరుకున్నారు. చంటి బిడ్డలతో వెనుక డోర్‌పై ప్రమాదకరంగా ఎందుకు కూర్చుంటున్నారని అడిగారు. ప్రయాణికులను ఆటోలో పరిమితికి మించి ఎందుకు ఎక్కించుకున్నావని డ్రైవర్‌ను ప్రశ్నించారు. ఆటో సడెన్‌గా బ్రేక్ వేస్తే వెనుక భాగంలో కూర్చున్న ప్రయాణికులు కింద పడిపోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకోసారి ఇలా పునరావృతం కాకుండా చూసుకోవాలని మందలించారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ మార్చగలిగే శక్తి

- తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య



మాట్లాడుతున్న అంబటి నాగయ్య

కోదాడరూరల్ : దేశ భవిష్యత్‌ను మార్చగలిగే శక్తి యువత చేతిలోనే ఉందని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో నిర్వహించిన పీవైఎల్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జరుగుతున్న మతోన్మాద రాజకీయాలను యువత తిప్పికొట్టాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అమెరికన్ సామ్రాజ్యవాదం పేద దేశాలపై ఆధిపత్యం చెలాయిస్తోందని అలాంటి దేశానికి మోదీ ప్రభుత్వం స్వాగతం పలకడం సిగ్గుచేటన్నారు. న్యూడెమోక్రసీ రాష్ట్రనాయకుడు గొని ఐలయ్య మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని చెప్పి ఇవ్వకుండా నిరుద్యోగులను, యువతను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి, ప్రతి ఏడాది ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తానని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని విమర్శించారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మోకాళ్ల రమేష్, కోలా లక్ష్మీనారాయణ, ప్రజా చైతన్య వేదిక నాయకులు రాయపూడి చిన్ని, ఉపాధ్యక్షులు వనమాల సత్యం, రమేష్, బేజాడి రవికుమార్, రవి, సిద్దేశ్వర్, ధరావత్ రవి, నల్గొండ నాగయ్య, బండి రవి, మోతీలాల్, బీవీ చారి, సిద్దులు, ఉమాశంకర్, మనోహర్, నరసింహారావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో రెండు నెలల జైలు

నిడమనూరు : బైక్ చోరీ కేసులో వ్యక్తికి రెండు నెలల జైలు, రూ.1000 జరిమాన విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి తీర్పు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా బోయనపల్లికి చెందిన గన్నెరు రాజశేఖర్ సొంత పనిపై 2024లో జనవరి 10న హాలియాకు వచ్చి, బస్టాండ్ వద్ద తన బైక్ ఉంచాడు. గంటసేపటి తర్వాత రాగా బైక్ కనిపించక పోవడంతో హాలియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ శోభన్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా పెద్దవూర మండలం, కుంకుడుచెట్టు తండాకు చెందిన రమావత్ రవి దొంగతనానికి పాల్పడ్డట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. వాదనల అనంతరం నేరం రుజువు కావడంతో దొంగతనానికి పాల్పడ్డ రవికి నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి స్వప్న రెండు నెలల జైలు శిక్ష, రూ.1000ల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

- బాలుడు మృతి, ముగ్గురికి గాయాలు

భువనగిరి, మోత్కూరు : కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం భువనగిరి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపల్ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన చేకూరి మల్లేషం భార్య విజయ, వారి కుమారుడు నిఖిల్, మల్లేషం అన్న కుమార్తె స్నేహతోపాటు, ఆమె నాలుగేళ్ల కుమారుడు అభిరామ్ నలుగురు కలిసి కారులో హైదరాబాద్‌లోని మేడిపల్లి నుంచి దసరా పండుగ నిమిత్తం ఆరెగూడెం వస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో భువనగిరి మండలం చందుపట్ల గ్రామ సమీపంలోకి రాగానే నిఖిల్ కారును అతి వేగంగా నడపడం, వర్షం వస్తుండడంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న అభిరామ్ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. కాగా.. అభిరామ్ తండ్రి ప్రేమ్‌కుమార్ హైదరాబాద్‌లో ఎస్ఐగా పని చేస్తున్నాడు.

సాగర్ వద్ద హైవేపై విరిగిపడిన కొండ చరియలు

నాగార్జునసాగర్: శిరోంచ–రేణిగుంట హైవే, నాగార్జునసాగర్ కొత్త బ్రిడ్జి దారిలో కొండ చరియలు విరిగి రోడ్డుపై పడ్డాయి. బండరాళ్లు రోడ్డువెంట గల డ్రైన్ రిటైనింగ్ సైడ్‌వాల్‌కు తగలడంతో పాక్షికంగా దెబ్బతిన్నది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వర్షం రావడంతో కొండప్రాంతమంతా నానింది. మట్టి కరిగి బండరాళ్లు రోడ్డుపైకి వచ్చాయి. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. పోలీసులు బండరాళ్లను ఎత్తి సైడ్ డ్రైన్‌లోకి దొర్లించారు.



విరిగిపడిన కొండ చరియలు

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

- వీరిలో ఒకరు రౌడీషీటర్

రామగిరి(నల్లగొండ): హత్య కేసులో నల్లగొండకు చెందిన ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఫ్యామిలీ కోర్టు జడ్జి దుర్గా ప్రసాద్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండకు చెందిన అనుముల వంశీకృష్ణ 2014 ఏప్రిల్ 25న తన స్నేహితులతో కలిసి గ్రీన్‌హిల్స్ కాలనీలో ఉన్నాడు. అక్కడకు వచ్చిన నలపరాజు రాజేష్, పెరిక సాయితేజతో వంశీకృష్ణకు గొడవ జరిగింది. దీంతో వంశీపై రాజేష్ కోపం పెంచుకున్నాడు. అదే రోజు సాయంత్రం వంశీకృష్ణ శివాజీనగర్‌లో ఉన్నాడని తెలుసుకున్న రాజేష్, అతని స్నేహితుడు పెరిక సాయి ఇద్దరూ కలిసి అక్కడికి వెళ్లారు. స్నేహితులతో కలిసి ఉన్న వంశీకృష్ణపై కత్తితో రాజేష్, సాయిలు విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశారు. ఈ ఘనపై వంశీకృష్ణ తండ్రి అనుముల రమేష్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై క్రాంతికుమార్ కేసు నమోదు చేశారు. సీఐలు రవీందర్, మనోహర్‌రెడ్డి, రవీందర్ విచారణ చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. మృతుడు వంశీ ఇచ్చిన మరణ వాంగ్మూలంతో పాటు, స్నేహితుల సాక్ష్యాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ జవహర్‌లాల్ కోర్టుకు సమర్పించారు. అతని వాదనలతో ఏకీభవించిన జడ్జి.. నిందితులైన రాజేష్, సాయితేజలకు జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. కాగా.. రాజేష్ ఇప్పటికే 18 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతడిపై రౌడీషీట్ కూడా ఉంది. లైజన్ ఆఫీసర్లు, నరేందర్. మల్లిఖార్జున్, కోర్టు కానిస్టేబుల్ సుమన్ కోర్టుకు సరైన ఆధారాలు సమర్పించడంలో సహకరించారు.

ఒక వ్యక్తికి రెండు జీవిత ఖైదులు

రామగిరి(నల్లగొండ): బాలికపై అత్యాచారానికి పాల్పడి ఆమె మృతికి కారణమైన వ్యక్తికి రెండు జీవిత ఖైదులు విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి ఎన్. రోజారమణి శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన కట్టెల సైదులు చిట్యాల మండలానికి చెందిన బాలికను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. అవమానం భరించలేక బాధిత బాలిక కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. బాలిక తల్లిదండ్రులు 2019 జూన్ 13న చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి 5 సెక్షన్ల కింద రెండు జీవిత ఖైదులు, 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.65వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. లైజన్ ఆఫీసర్లు నరేందర్, మల్లిఖార్జున్ కోర్టుకు సరైన ఆధారాలు సమర్పించడంలో సహకరించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ఆదర్శనీయం



డాక్యుమెంటరీ చిత్రం సీడీని ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ, మసన చెన్నప్ప

చౌటుప్పల్ : స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ఆదర్శప్రాయంగా నిలుస్తుందని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. చౌటుప్పల్‌కు చెందిన నిర్మాత చిరందాసు ధనుంజయ్య, పోచంపల్లికి చెందిన దర్శకుడు బడుగు విజయ్‌కుమార్‌లు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా నిర్మించిన యూనిటీ, ద మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్ పేరిట నిర్మించిన డాక్యుమెంటరీ చిత్రాన్ని శుక్రవారం ప్రముఖ రచయిత మసన చెన్నప్పతో కలిసి హైదరాబాద్‌లో విడుదల చేశారు. శనివారం జరగనున్న బాపూజీ జయంతికి డాక్యుమెంటరీని అంకితం ఇస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

చెరువులో గుర్తుతెలియని రెండు మృతదేహాలు లభ్యం

భువనగిరి: మండలంలోని రాయగిరి పెద్ద చెరువులో శుక్రవారం గుర్తు తెలియని రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయగిరి చెరువు వద్ద బతుకమ్మ సంబురాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమయంలో చెరువులో రెండు మృతదేహాలను గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. ఇందులో ఒకరు పురుషుడు, మరొకరిది మహిళ మృతదేహంగా గుర్తించారు. నాలుగైదు రోజుల క్రితం చెరువులో దూకినట్లు అంచనా వేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

ఉపాధినిస్తున్న బతుకమ్మ

- బతుకమ్మ పూల కోసం బంతి, పట్టుకుచ్చుల పూల సేద్యం
- ముత్యాలపూలకు రంగులద్ది మార్కెట్‌లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్న జానమ్మ



జానమ్మ సాగు చేస్తున్న బంతి, సీతజడ పూల తోట

రాజాపేట : ఆడపడుచులకు బతుకమ్మ అత్యంత ఇష్టమైన పండుగ. వీటిని పేర్చడానికి తంగేడు, గునుగు, ముత్యాల పువ్వు, పట్టుకుచ్చులు, బంతి, చామంతి, రుద్రాక్ష, గుమ్మడి, టేకు వంటి పూలను ప్రధానంగా వాడుతారు. కానీ ప్రస్తుతం ప్రతి ఒక్కరూ కాలంతోపాటు పరుగెడుతున్నారు. ఎవ్వరికీ తీరికలేక పోవడంతో బతుకమ్మకు కావాల్సిన పూలను సేకరించేందుకు సమయాన్ని వెచ్చించడం లేదు. అయితే కొంతమంది మహిళలు మారుతున్న కాలానికి అనుగుణంగా పూలను సేకరించి వాటికి రంగులద్ది మార్కెట్‌లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా ప్రత్యేకంగా బతుకమ్మ పండుగ సీజన్‌లో బంతి, పట్టుకుచ్చుల పూలు, ముత్యాల పువ్వు వంటి పంటలు సేద్యం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. రాజాపేట మండల కేంద్రానికి చెందిన గొల్లెన జానమ్మ 5 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని కొంత భూమిలో వరిసేద్యం చేయడమే కాకుండా అర ఎకరంలో బంతి, అర ఎకరంలో పట్టుకుచ్చుల పూలు సేద్యం చేస్తోంది. రైతుల పొలాల్లో దొరికే ముత్యాల పువ్వు కొనుగోలు చేసి వాటికి రంగులద్ది విక్రయిస్తూ జీవనోపాధి పొందుతోంది. బంతి, పట్టుకుచ్చులు, ముత్యాల పువ్వు రూ. 100కు నాలుగు కట్టల చొప్పున విక్రయిస్తోంది.



ముత్యాలపువ్వుకు రంగులద్ది కట్టలు కడుతున్న జానమ్మ

పూలకు రంగులద్ది విక్రయిస్తాను

ప్రస్తుతం చాలా మందికి బతుకమ్మ కోసం పూలు సేకరించేందుకు బయటకు వెళ్లే తీరిక లేకుండా పోయింది. అందుకే నేను ప్రతి ఏటా బతుకమ్మ పండుగ సందర్భంగా తీరొక్క పూలు సేకరించి వాటికి రంగులద్ది విక్రయిస్తున్నా. రూ. 100కు నాలుగు కట్టల చొప్పున ఇస్తాను. బంతి, పట్టుకుచ్చుల పూల పంట సేద్యం చేశాను.

– జానమ్మ, మహిళా కూలీ, రాజాపేట

అటవీ భూములు పరిశీలించిన అదనపు చీఫ్ కన్జర్వేటర్

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడెం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కోల్పోయిన ఫారెస్ట్ భూములను రాష్ట్ర అదనపు చీఫ్ కన్జర్వేటర్ ప్రవీణ శుక్రవారం సందర్శించారు. అటవీ భూముల విస్తీర్ణాన్ని పర్యవేక్షించి వివరాలు సేకరించారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా అటవీ భూముల వివరాలను సేకరించేందుకు సంబంధిత అధికారుల నుంచి పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఆమె వెంట మర్రిగూడ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ డి.అఖిలేష్‌గౌడ్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లావణ్య, రాములు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉదయ్ ఉన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని పలు లాడ్జీలను ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, పట్టణ సీఐ భాస్కర్ ఆదేశాల మేరకు ఎస్సైలు యాదయ్య, సైదులు ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. శ్రీలక్ష్మీనివాస్ ఫ్యామిలీ లాడ్జి, మణికంఠ లాడ్జిల్లో నిబంధనలు పాటించకపోవడంతో వాటి యజమానులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ భాస్కర్ తెలిపారు.